నెంబర్ ప్లేట్లు లేని బైకులు సీజ్: ట్రాఫిక్ ఏసీపీ

ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మామిళ్లగూడెం, అక్టోబర్ 19: ఖమ్మం నగరంలో నెంబర్ ప్లేట్లు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ద్విచ క్రవాహనాలను సీజ్ చేస్తున్నామని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం జరిపిన తనిఖీల్లో నెంబర్ ప్లేట్లు, రిజిస్ట్రేషన్లు లేకుండా తిరుగుతున్న 55 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు, ఆర్ఐ సాంబశివరావు, ఎస్ఐ రవి, సాగర్, రాములు పాల్గొన్నారు.

బీజేపీ ఫాసిస్టు విధానాలతోనే హక్కుల నేత మరణం

ఆచార్య జీఎస్ సాయిబాబా సంస్మరణ సభలో వక్తలు

మాట్లాడుతున్న డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్

మామిళ్లగూడెం, అక్టోబర్ 19: కేంద్రంలోని మతతత్వ బీజేపీ ఫాసిస్టు విధానాలతోనే ప్రొఫెసర్ జీఎస్ సాయిబాబా మరణించారని, ఆయన ఆలోచనలను నిర్బంధించి వేధింపులకు గురిచేశారని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ పౌర సమూహం (సీపీఏ) ఆధ్వర్యంలో ఖమ్మంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. స్పర్శ భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముందుగా సాయిబాబా చిత్రపటానికి వక్తలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తున్న సాయిబాబాను 2014లో అరెస్టు చేసి 2024 వరకు అత్యంత క్రూరంగా జైలులో నిర్బంధించారని, 90 శాతం వైకల్యంతో ఉన్న ఆయనను హింసించారని ఆరోపించారు. బీజేపీ విధానాల వల్లనే ఆయన మరణించారని అన్నారు. డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, ఐవీ రమణరావు, ఆవుల వెంకటేశ్వర్లు, అవునూరి మధు, జితేందర్‌రెడ్డి, ఎర్రా శ్రీకాంత్, డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, డాక్టర్ రెహనాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఓటును నమోదు చేసుకోవాలి

కొణిజర్ల, అక్టోబర్19: వరంగల్, ఖమ్మం, నల్గొండ నియోజకవర్గంలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఓటును నమోదు చేసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి పేర్కొన్నారు. శనివారం మండలంలోని తనికెళ్లలో గల మైనార్టీ, జ్యోతిబాయ్‌పూలే పాఠశాలలను సందర్శించి అర్హత గల ఉపాధ్యాయులందరూ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. షేక్ రంజాన్, మహేశ్, లివింగ్‌స్టన్, మాదాల ప్రసాద్, చిలుకూరు వీరస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

చింతకాని, అక్టోబర్ 19: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందిస్తున్నారని మండల విద్యాశాఖ అధికారి వీరపనేని శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహిస్తున్న తల్లిదండ్రుల సమావేశాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు బీవీ శర్మ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపీ రఘురాంరెడ్డి

వైరా టౌన్: మాట్లాడుతున్న ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

వైరాటౌన్, అక్టోబర్ 19: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, రాష్ట్రంలో ఉన్న అన్ని వర్గాల కులస్థులకు సబ్సిడీపై సంక్షేమ పథకాలు అందిస్తుందని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. శనివారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమం, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో గీత కార్మికులకు రక్షణ కవచం కిట్లను ఎంపీ రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అందజేశారు. గీత కార్మికులు ఆర్థికంగా ఎదిగేందుకు సబ్సిడీపై రుణాలు, యంత్ర పరికరాలు అందజేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ సూపరిటెండెంట్ జనార్దన్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి జ్యోతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పలు శాఖల అధికారులు, గీత కార్మికులు, పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్‌లో చేపపిల్లల విడుదల

రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన చేప పిల్లలను ఎంపీ, ఎమ్మెల్యే వైరా రిజర్వాయర్‌లో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లలను కొనుగోలు చేసి వందశాతం రాయితీపై అందజేస్తుందన్నారు. వైరా రిజర్వాయర్‌లో 14లక్షల చేప పిల్లలను విడుదల చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి శివ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, మత్స్య సొసైటీ చైర్మన్ రహీం, జిల్లా కన్వీనర్ మామిడి వెంకటేశ్వర్లు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైస్ చైర్మన్ సీతారాములు, మున్సిపాల్ కమిషనర్ వేణు, సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులకు రక్షణ కవచాల పంపిణీ

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 19: బీసీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగానే గౌడ కులస్తుల రక్షణ కోసం కాటమయ్య రక్షణ కవచాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి అన్నారు. శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి అధ్యక్షతన జరిగిన రక్షణ కవచాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సత్తుపల్లి నియోజకవర్గంలో వంద మంది గీత కార్మికులకు రక్షణ కవచాలు అందించామని పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గంలోని 216 మంది లబ్ధిదారులకు రూ.61, 26,000 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆశ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో 25 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థినులకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహాలను ఆశ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు దయానంద్, ఎంపీ రఘురాంరెడ్డి అందించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళల బలవన్మరణం

మామిళ్లగూడెం, అక్టోబర్ 19: వేర్వేరు కారణాలు, వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. వీరిలో ఒకరు భర్త నుంచి విడిపోయి కుమార్తెతో కలిసి ఒంటరిగా జీవిస్తుండగా, మరొకరు భర్త మరణించడంతో కుమార్తె కలిసి జీవితం వెళ్లదీస్తోంది. ఖమ్మం టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం..

పెనుబల్లి మండలం మొండికుంటకు చెందిన మద్దినేని సరస్వతి (35) భర్త నరేశ్‌తో విడిపోయి కొంతకాలంగా ఖమ్మంలోని ఉపేంద్రయ్యనగర్‌లో నివసిస్తోంది. బ్యూటీషియన్‌గా పనిచేస్తూ తన ఏడేళ్ల కుమార్తెతో కలిసి జీవిస్తోంది. దంపతులు ఇద్దరు విడిపోయిన సమయంలో కుమారుడు భర్త వద్ద ఉండగా కుమార్తె సరస్వతి వద్ద ఉంటోంది. అద్దె ఇంట్లో నివసముంటున్న సరస్వతి కొన్ని రోజులుగా మూభావంగా ఉంటోంది. శనివారం ఉదయం నిద్ర లేచిన కుమార్తెకు.. తల్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. దీంతో భయపడిపోయిన చిన్నారి.. వెంటనే తన అమ్మమ్మకు వీడియోకాల్ చేసి చూపించింది. దీంతో వారు పరుగుపరుగున ఘటనా స్థలానికి వస్తూనే పోలీసులకూ సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ బృందం సహాయంతో కిందికి దింపారు. ఈ విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి తండ్రి కాపు నర్సింహారావు ఫిర్యాదు మేరకు మృతదేహానికి పంచనామా చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏన్కూరుకు చెందిన తనికెల కృష్ణవేణి (33) ఖమ్మంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్ ఉమెన్‌గా పనిచేస్తోంది. భర్త మరణించడంతో ఐదేళ్లుగా ఖమ్మంలో నివాసముంటూ తన కుమార్తెతో కలిసి జీవిస్తోంది. కుటుంబ సమస్యలు పెరగడంతో మానసికంగా ఇబ్బందులకు గురై ఈ నెల 17 ఎలుకలమందు తాగింది. స్థానికులు గుర్తించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న కృష్ణవేణి.. 18న అర్ధరాత్రి మరణించింది. ఈ ఘటనపై మృతురాలి సోదరి తాళ్లూరి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టార్బాలిన్ పట్టాల పంపిణీ

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 19: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని కిష్టారం ఎస్సీకాలనీకి చెందిన 12 మందికి సత్తుపల్లి సింగరేణి కిష్టారం ఓసీ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో టార్పాలిన్ పట్టాలను ఎమ్మెల్యే మట్టా రాగమయి, మట్టా దయానంద్, సింగరేణి పీవో నర్సింహారావు శనివారం అందజేశారు. సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీకాలు

కొణిజర్ల, అక్టోబర్19: మండలంలోని పెద్ద గోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు పెద్దగోపతి పీహెచ్‌సీ డాక్టర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మార్క్, వ్యాయామ ఉపాధ్యాయుడు షేక్ రంజాన్, ఉపాధ్యాయులు కటారి శ్రీనివాసరావు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది నాగేశ్వరరావు, సంజీవరావు, జమున, భూమిలీ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

'వద్దిరాజు'ను కలిసిన కేసముద్రం ఏఎంసీ చైర్మన్

ఎంపీ వద్దిరాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్

మామిళ్లగూడెం, అక్టోబర్ 19: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రను కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డిని వద్దిరాజు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. యాదవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వేం రామచంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా సంపత్‌కుమార్

మధిర, అక్టోబర్ 19: మధిర మున్సిపల్ కమిషనర్‌గా సంపత్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లతను మర్యాదపూర్వకంగా కలిశారు.

విద్యార్థులు నీట్, ఎప్‌సెట్ సాధించాలి

జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు

మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ అధికారి

ముదిగొండ, అక్టోబర్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నీట్, ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. అనంతరం కళాశాల రికార్డులు పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

వేంసూరు, అక్టోబర్ 19: మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన పుచ్చ వెంకటేశ్వరరావు(36) గ్రామంలోని ఇద్దరు వ్యక్తులతో కలిసి అమ్మపాలెం చెరువులోకి శుక్రవారం సాయంత్రం చేపల వేటకు వెళ్లాడు. వెంకటేశ్వరరావుతో వచ్చిన ఇద్దరు వ్యక్తులు చెరువులోకి దిగగా తర్వాత వెంకటేశ్వరరావు చెరువులోకి దిగగానే ఊబిలోకి కురుకుపోయి గల్లంతయ్యాడు. అతనితో పాటు వచ్చిన ఇద్దరు మునిగిన ప్రాంతంలో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. శుక్రవారం రాత్రి వరకు చెరువులో ఆచూకీ లభించకపోవడంతో శనివారం వైరా నుంచి గజ ఈతగాళ్లను రప్పించి చెరువులో గాలించగా శనివారం సాయంత్రం మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లికు తరలించి ఎస్సై వీరప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు బడారో బంజారా భరోసా

ఖమ్మం రూరల్, అక్టోబర్ 19: ఇటీవలి మున్నేటి వరదలకు సర్వస్వం కోల్పోయిన బాధితులకు బడావో బంజారా ఫౌజేర్ ట్రస్టు భరోసాగా నిలిచింది. జలగంనగర్ కాలనీలోని 310 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.25 కేజీల చొప్పున శనివారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు బాధ్యులు మాట్లాడుతూ.. ప్రకృతి ప్రకోపానికి నిరాశ్రయులైన ప్రజలకు అండగా నిలిచేందుకే తాము ఈ వితరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు.

మల్లేపల్లిలో 180 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

కూసుమంచి, అక్టోబర్ 19: కూసుమంచి మండలం మల్లేపల్లి వద్ద లారీలో 150 క్వింటాళ్ల బియ్యాన్ని ఎస్సై నాగరాజు తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. లారీలో, ట్రాలీలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారంటూ అందిన సమాచారం మేరకు పోలీసులు వెళ్లి మల్లేపల్లి వద్ద సదరు లారీని, ట్రాలీని పట్టుకున్నారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు అప్పగిస్తామని, అవి రేషన్ బియ్యమని తేలితే సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు. లారీ డ్రైవర్‌ను, ట్రాలీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేలకొండపల్లిలో 60 బస్తాల బియ్యం..

నేలకొండపల్లి మండలం ముఠాపురంలో శనివారం తెల్లవారుజామున బొలెరో వాహనంలో తరలిస్తున్న 60 బస్తాల బియ్యాన్ని ఎస్సై సంతోశ్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. బొలెరో వాహనాన్ని, దాని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. బియ్యాన్ని సివిల్ సప్లయి అధికారులకు పంపిస్తామని, తరువాత సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

పిడుగుపాటుతో ముగ్గురు మహిళలకు అస్వస్థత

తిరుమలాయపాలెం, అక్టోబర్ 19: మండలంలోని బచ్చోడుతండాలో శనివారం సాయంత్రం పిడుగు పడడంతో ముగ్గురు మహిళలు అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. బచ్చోడుతండాలో శనివారం సాయంత్రం ఒక్కసారిగా గాలి, ఉరుములు మెరుపులతో వర్షం మొదలైంది. ఆ సమయంలో పొలంలో పనిచేస్తున్న ముగ్గురు మహిళలు అక్కడే ఉన్న ఓ చెట్టు కిందికి వెళ్లారు. వారు నిలుచున్న చెట్టుపై ఒక్కసారిగా పిడుగుపడడంతో బచ్చోడుతండాకు చెందిన భూక్యా శారద, ఆమె కుమార్తె దేవి, మరో మహిళ దారావత్ జీజా అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు వారిని 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఎర్రుపాలెం, అక్టోబర్ 19: మండల పరిధిలోని మామునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన జీ.విజయశ్రీ రూ.1.50 లక్షల వితరణతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం దాత ప్రారంభించారు.

ఇమామ్ అజీజ్ కుటుంబానికి అజయ్ ఆర్థిక సాయం



అజీజ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం, అక్టోబర్ 19: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఖమ్మం జామా మస్జీద్ ఇమామ్ అజీజ్ కుటుంబానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అండగా నిలిచారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆర్థిక సాయంగా రూ.లక్ష అందజేశారు. కుటుంబానికి ఏ కష్టమొచ్చినా ఎల్లప్పుడూ తాను అండగా నిలుస్తానని మాట ఇచ్చారు. ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌లోకి మహీంద్రా థార్ రాక్స్

మహీంద్రా థార్ రాక్స్‌ను ఆవిష్కరిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్

రఘునాథపాలెం, అక్టోబర్ 19: సరికొత్త మోడల్ వాహనాల తయారీ దిగ్గజ సంస్థ మహీంద్రా మరో నూతన కారును మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. థార్ రాక్స్ పేరుతో మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ మేరకు నూతన థార్ రాక్స్ కారు ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ఖమ్మంలోని మహీంద్రా షోరూంలో జరిగింది. దీనికి కేఎంసీ కమిషనర్ అభిషేక్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అంతేగాక బజాజ్ సంస్థ తీసుకొచ్చిన సీఎన్జీ రెండు నూతన మోడల్ బైకులను మార్కెట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మూడు రకాల వాహనాలను ఒకేసారి మార్కెట్‌లోకి తీసుకొచ్చిన వీవీసీ గ్రూపు సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్‌ను అభినందించారు. టూటౌన్ సీఐ బాలకృష్ణ, వీవీసీ గ్రూప్ సంస్థల చైర్మన్ ద్రౌపతి, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, వైరా బ్రాంచ్ వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని దేవభక్తుని సుదర్శ, S/O. నరసింహరావు, వయస్సు : 36 సం॥లు, నివాసం : ప్లాట్ నెం.115, అనుహార్ మార్నింగ్ రాగ, రోడ్ నెం.26, యం.జి.పార్కు ప్రక్కన, అల్కపురిటౌన్ షిప్, మణికొండ, రంగారెడ్డి జిల్లా గారికి బుణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 5 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి–1 : ఖమ్మం జిల్లా, ఖమ్మం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, వైరా సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలో ఖమ్మం జిల్లా పరిషత్, వైరా మండల పరిషత్, వైరా మున్సిపాలిటీలో చేరిన సోమవరం గ్రామ రెవిన్యూ రికార్డుకు చెందిన సర్వే నెం. 262, 263అ, 263ఆ, 263ఇ, 263ఈ (ఖమ్మం ఆర్.డి.ఓ. వారి ప్రొసీడింగ్స్ నెంబర్స్ : A4/1691/2013, A4/1692/2013 ద్వారా సర్వే నెంబర్లు 262, 263/A, 263/AA, 263/E, 263/EE)గా గల భూమిలో చేసిన ప్లాట్ల మింజుమలె ప్లాటు నెంబరు 47 విస్తీర్ణం చ॥గ॥ 253.85లు, ఇందుకు సరియగు చ॥మీ॥ 212.24, డాక్యుమెంట్ నెం. : 2736/2024 గల అట్టి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : తూర్పు : 40'అడుగుల వెడల్పు గల ప్రతిపాదిత రోడ్డు, పడమర : ప్లాటు నెం. 19, ఉత్తరం : ప్లాటు నెం. 46, దక్షిణం : ప్లాటు నెం. 48.

షెడ్యూలు ఆస్తి–2 : ఖమ్మం జిల్లా, ఖమ్మం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, వైరా సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలో ఖమ్మం జిల్లా పరిషత్, వైరా మండల పరిషత్, వైరా మున్సిపాలిటీలో చేరిన సోమవరం గ్రామ రెవిన్యూ రికార్డుకు చెందిన సర్వే నెం. 262, 263అ, 263ఆ, 263ఇ, 263ఈ (ఖమ్మం ఆర్.డి.ఓ. వారి ప్రొసీడింగ్స్ నెంబర్స్ : A4/1691/2013, A4/1692/2013 ద్వారా సర్వే నెంబర్లు 262, 263/A, 263/AA, 263/E, 263/EE)గా గల భూమిలో చేసిన ప్లాట్ల మింజుమలె ప్లాటు నెంబరు 48 విస్తీర్ణం చ॥గ॥ 253.47లు, ఇందుకు సరియగు చ॥మీ॥ 211.92, డాక్యుమెంట్ నెం. : 2737/2024 గల అట్టి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : తూర్పు : 40'అడుగుల వెడల్పు గల ప్రతిపాదిత రోడ్డు, పడమర : ప్లాటు నెం. 19, ఉత్తరం : ప్లాటు నెం. 47, దక్షిణం : Utility Area మరియు ఇతరుల స్థలం.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం.
సెల్ : 9848022542

నిబంధనల మేరకు ధాన్యం సేకరణ : డీసీఎంఎస్ చైర్మన్

మాట్లాడుతున్న డీసీవో గంగాధర్

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 19: ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం సేకరించి రైతులు మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్ అన్నారు. ధాన్యం సేకరణకు నియమితమైన సెంటర్ల ఇన్‌చార్జిలకు నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీసీఎంఎస్ ద్వారా జిల్లాలో ఎనిమిది మండలాల్లో 30 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ సందీప్, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 19: వానకాలం ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని డీసీవో గంగాధర్ సూచించారు. 'పీఏసీఎస్‌ల ద్వారా వానకాలం ధాన్యం కొనుగోళ్లు' అనే అంశంపై కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, అవసరమైన గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు, తేమ శాతం నిర్ధారణ యంత్రాలు, వేయింగ్ మెషీన్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు, మద్దతు ధర, రైతులు తీసుకురావాల్సిన పత్రాల వంటి వివరాలను తెలియజేస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని సూచించారు. సోమవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించారు. సహాయ రిజిస్ట్రార్లు ఎండీ ఆసిఫ్ అన్వర్, వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ సెక్రటరీలు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు, మానిటరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రైతులు దళారుల బారిన పడొద్దు

చింతకాని, అక్టోబర్ 19: రైతులు దళారుల బారిన పడొద్దని, ప్రతి దాన్యపు గింజను ప్రభుత్వమే కోనుగోలు చేస్తుందని తహసీల్దార్ కూరపాటి అనంతరాజు అన్నారు. శనివారం చింతకాని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి, డైరెక్టర్ కిలారు మనోహర్‌బాబు, సీఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైలు నుంచి కిందపడి వ్యక్తి మృతి

మామిళ్లగూడెం, అక్టోబర్ 19: కదులుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తూ కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మరణించిన ఘటన ఖమ్మంలో చోటుచేసుకుంది. శనివారం ఖమ్మం జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం.. శనివారం సుమారు ఉదయం 9:40 గంటల సమయంలో ఖమ్మం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఓ రైలు నుంచి ఓ గుర్తు తెలియన వ్యక్తి ఖమ్మం – పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్యలో కిందపడి మరణించాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గుర్తించేందుకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఘటనపై జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని గుర్తించిన వ్యక్తులు 8712658589 నంబరును సంప్రదించాలని కోరారు.

అపస్మారక స్థితిలో ఉన్న మహిళ, పిల్లలకు సాయం

మామిళ్లగూడెం, అక్టోబర్ 19: ఇద్దరు పిల్లలతోపాటు అపస్మారక స్థితిలో ఉన్న ఓ మహిళకు దిశ కమిటీ సభ్యులు శనివారం సహాయ సహకారాలు అందించారు. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం పాత మున్సిపాలిటీ ప్రాంతంలో వారం రోజులుగా ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి తచ్చాడుతోంది. ఈ క్రమంలో తల్లి, ఇద్దరు పిల్లలు అపస్మారక స్థితిలో ఉన్న విషయాన్ని స్థానికుల ద్వారా దిశ కమిటీ సభ్యులు తెలుసుకున్నారు. కమిటీ అధ్యక్షురాలు పమ్మి అనిత, సుష్మ సహా ఇతర కమిటీ సభ్యులు వెళ్లి ఆ మహిళ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఆమె ఇక్కడ ఉండడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. తరువాత ప్రభుత్వ సఖి కేంద్ర సభ్యులు, మహిళా పోలీసు స్టేషన్ సిబ్బందితో చర్చించి ఆ మహిళ సొంత గ్రామమైన వరంగల్‌కు వారిని పంపేందుకు ఏర్పాట్లు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

PLOT FOR SALE

★గజం: 2,500/- నార్కెట్‌పల్లి దగ్గర గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో స్విమ్మింగ్ పూల్, కాటేజీ, 30 పండ్ల మొక్కలు, 30 ఎర్రచందనం మొక్కలతో 5 & 10 గుంటల ప్లాట్స్ అమ్మబడును. దసరా ఆఫర్ 10 గ్రా. గోల్డ్ కలదు. 7569587521.
NT-338783

WANTED

★Req. Cashier, Female Waiter, South Indian Lunch & Tandoori Master, Housekeeping for Restaurant @ AS Rao Nagar. 9393123493, 7995900498.
NT-334839-All

WANTED PLOTS

★హైదరాబాద్, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, పసుమాముల, అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, గ్రీన్‌సిటీ, మౌంట్ ఒపేరా, సింగరేణికాలనీలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-336725

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

ఉస్మానియా వైస్ చాన్స్‌లర్ నియామకంపై హర్షం

ఎర్రుపాలెం, అక్టోబర్ 19: ఉస్మానియా యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌గా మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రొఫెసర్ ఎం.కుమార్‌ను నియమించడంపై మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) పక్షాన స్వాగతిస్తున్నామని ఎంఎస్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరి రత్నాకర్ పేర్కొన్నారు. అన్ని అర్హతలు కలిగి ఉన్న ప్రొఫెసర్ నూతన వైస్‌ఛాన్సలర్ ఎం.కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

మధిర రూరల్, అక్టోబర్ 19: పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని హ్యూమన్ రైట్స్ సభ్యుడు కోట వెంకట్ అన్నారు. మండలంలోని ఇల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేటి సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల భవిష్యత్‌పై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు.

రాఘవరెడ్డికి నివాళి

మధిర, అక్టోబర్ 19: మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లిలో బీఆర్ఎస్ నాయకుడు ఉమామహేశ్వరరెడ్డి తాతయ్య శీలం రాఘవరెడ్డికి బీఆర్ఎస్ నాయకులు నివాళి అర్పించారు. నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, చావా వేణు, తిమోతి, వంకాయలపాటి నాగేశ్వరరావు, అనమయ్య, పరిస శ్రీనివాసరావు, నాగబాబు ఉన్నారు.

బైక్ వాగులోకి దూసుకెళ్లి వ్యక్తి మృతి

ముదిగొండ, అక్టోబర్ 19: బైక్ వాగులోకి దుసుకెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వనంవారి కిష్టాపురానికి చెందిన బుడిగ బాబు (36) గ్రానైట్ కార్మికుని పనిచేస్తున్నాడు. పని నిమిత్తం శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఖమ్మం వెళ్తుండగా కిష్టాపురం గ్రామ శివారులోని దూకుడుబందం వాగు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లడంతో బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

సత్తుపల్లి, అక్టోబర్ 19: కల్లూరులోని తోపుడు బండి ఫౌండేషన్ చైర్మన్ సాధిక్‌అలీ ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ కల్లూరు పాఠశాల విద్యార్థులకు శనివారం ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలని, అందుకు విద్యయే ప్రధాన కారణమన్నారు. అనంతరం తవిద్యార్థులకు టేబుల్‌బుక్స్, డైరీలు, డ్రాయింగ్‌బుక్స్, కాపీరైటింగ్‌బుక్స్, పాఠశాల సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన మైక్రోస్కోప్, విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అడవిమల్లెలలో కంటి వైద్యశిబిరం

పెనుబల్లి, అక్టోబర్19: మండలంలోని అడవిమల్లెల శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మం మమత కంటి వైద్యశాల వారిచే శనివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని గ్రామంలోని రైతువేదికలో నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మాధురి, డాక్టర్ సాయితేజ, డాక్టర్ దీపిక 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 26 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించారు.

క్రైస్తవులను ప్రభుత్వం ఆదుకోవాలి

పెనుబల్లి, అక్టోబర్ 19: క్రైస్తవ అవసరాలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని అసోసియేషన్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్ పీ ఎనోశ్‌కుమార్ అన్నారు. మండలంలోని కొండ్రుపాడు గ్రామంలో శనివారం మిస్సా ప్రార్థన మందిరంలో జరిగిన సేవకుల సహవాస కూడికలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమం కోసం క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.

వీల్‌చైర్ అందజేత

వైరాటౌన్, అక్టోబర్ 19: గ్రేట్ విజన్ క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో మండలంలోని గొల్లెనపాడు గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కంచర్ల నాగేంద్రమ్మకు 6వ వార్డు కౌన్సిలర్ లయన్ లగడపాటి లక్ష్మీరాజ్యం ఆర్థిక సాయంతో శనివారం వీల్‌చైర్ అందజేశారు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య

కొణిజర్ల, అక్టోబర్ 19: పురుగుమందు తాగి యువకుడు బలన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని లాలాపురంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై జీ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయల నర్సింహారావు(24) కడుపునొప్పి తాళ్లలేక శుక్రవారం రాత్రి మోనోక్రోటోపాస్ పురుగుమందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు క్షతగాత్రుడిని ఖమ్మం తరలించగా అప్పటికే పరిస్థితి విషమించి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ద్విచక్ర వాహనదారుడు మృతి

ఖమ్మం రూరల్, అక్టోబర్ 19: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామానికి చెందిన భూక్యా రవి (40) తన బైకుపై ఈ నెల 11న వెన్నారం నుంచి మంగళగూడెం వైపు బయలుదేరాడు. బొడ్డువారి మూలమలువు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న కందకంలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న రవి భార్య సరోజ బంధువుల సహాయంతో అతడిని ఖమ్మంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 15న వరంగల్ ఎంజీఎంలో చేర్పించారు. అక్కడ అతడు చికిత్సపొందుతూ ఈ నెల18న రాత్రి మరణించాడు. మృతుడి భార్య సరోజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.